## కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యం



సంజన(ఫైల్)

ఘట్‌కే సర్,జూన్4: కళాశాలకు వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ సైదులు వివరాల ప్రకారం.. దాసోసు సంజన (18) ఉప్పల్ విజయపురి కాలనీలో నివాసం ఉం టుంది. అవుశాపూర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతుంది. కాగా.. ఈనెల 3న కళాశాలకు వెళ్లిన సంజన సాయంత్రం కళాశాల బస్సులో వచ్చి ఉప్పల్‌లో దిగింది. అయితే ఇంటికి వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. సంజనకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సరిపర ప్రాంతాల్లో గాలించినా, బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీకి సిద్ధం

జూబ్లీహిల్స్,జూన్4: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధమయ్యాయి. ఖైరతాబాద్-2 మండలంలో 6 ఉన్నత పాఠశాలలు, 24 ప్రాథమిక పాఠశాలలతో పాటు 2 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలలకు 64,505 పాఠ్యపుస్తకాలు అవసరముండగా మొదటి విడుత 15,600 పుస్తకాలు, రెండో విడుత 32,175 పుస్తకాలను తరలించారు. వీటితో పాటు 10 వేల నోట్ పుస్తకాలు అందినట్లు.. తుది విడుతలో మిగతా పుస్తకాలు, నోట్ బుక్కులు తరలిస్తామని డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఖైరతాబాద్-2 మండలంలో పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాల భాస్కర్**




కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాల భాస్కర్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి కిరణ్‌కుమార్, తదతరులు

చర్లపల్లి, జూన్ 4 : మేడ్చల్, మల్కాజిగిరి న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాల భాస్క ర్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ పోస్టర్‌ను మంగళవారం కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 8న జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, కేసులను త్వరితగతిన పరిష్కరిం చేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమిన ల్, వాహన ప్రమాద, బ్యాంక్ రికవరీ, చెక్‌బౌన్స్, భూవివాదా ల కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నర్సింహారెడ్డి, దేవిడ్‌రాజుతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.



మలక్‌పేట వైద్యశాలలో లతారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

## కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే బండారి

రామంతాపూర్, జూన్ 4 : బీఆర్‌ఎస్ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం అనారోగ్యంతో మలక్‌పేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు చెప్పాల లతారెడ్డిని ఆయన పరామర్శించారు. ఆరోగ్యం విషయంలో డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకుని మనోధైర్యం చెప్పారు. ఆరోగ్య పరంగా, పిల్లల చదువుల పరంగా ఎలాంటి అవసరం ఉన్నా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాయసం గోపాల్, అలెగ్జాండర్, సీహెచ్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో బీజేపీకి 1.88 లక్షల ఓట్లు



కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న ఈటల రాజేందర్

మేడ్చల్, జూన్ 4 : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మేడ్చల్‌లో బీజేపీ పట్టు నిలుపుకుంది. నగర శివారులో ఉన్న మేడ్చల్ నియోజకవర్గం పట్టణ, గ్రామీణ సమ్మిళితంగా ఉన్నది. అన్ని నియోజకవర్గాల కంటే అత్యధిక శాతం ఓటింగ్ మేడ్చల్‌లో జరిగింది. పోటీచేసే అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు ఇక్కడే వచ్చాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 6,65,979 మంది ఓటర్లు ఉండగా, 3,85,134 ఓట్లు పోలయ్యాయి. అందులో బీజేపీకి లక్షా 88వేల 370 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు లక్షా 19వేల 125 ఓట్లు, బీఆర్ఎస్‌కు 67,246 ఓట్లు వచ్చాయి. నోటాకు 2456 మంది ఓటేశారు. పూర్తి ఫలితాలు వెల్లడి కానున్న సమయంలో బోగారంలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ చేరుకున్నారు. మీడియా పాయింట్ వద్ద ఫలితాలపై మాట్లాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఓటర్లు మాత్రం బీజేపీ వైపు మొగ్గు చూపారన్నారు. ఆ పార్టీతో సరిసమానంగా సీట్లు బీజేపీకి దక్కాయని, రానున్న భవిష్యత్ బీజేపీదే అని అన్నారు. కంటోన్మెంట్‌తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

### ఉప్పల్‌లో బీజేపీకి అత్యధిక ఓట్లు..

ఉప్పల్, జూన్ 4 : మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో భారతీయ జనతాపార్టీ అత్యధిక ఓట్లను సాధించింది. ఉప్పల్ అసెంబ్లీలో 5,40,052 ఓట్లు ఉండగా 2,61,634 ఓట్లు పోలయ్యాయి. అయితే మంగళవారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 1,30,105 ఓట్లు రాగా, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థికి 76,870 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్‌పార్టీకి 48,949 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థికి ఉప్పల్ అసెంబ్లీలో 53235 ఓట్ల అధిక్యం లభించింది. నోటాకు 1880 ఓట్లు లభించాయి. మల్కాజిగిరి పార్లమెంట్‌లో మొత్తం 19,09174 ఓట్ల పోలింగ్ నమోదైంది.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవ పూజలో భక్తులు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 4 : కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీలక్ష్మీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. మంగళవారం ఉదయం విశ్వక్షేనారాధనం, పుణ్యాహావచనం, యాగశాల కైంకర్యములు, పల్లకి ఉత్సవం, మోహినీ అలంకరణలో ఊరేగింపు, శ్రీస్వామి ఉత్సవ మూర్తులకు స్నపనం, సాయంత్రం వేదము, నాదము, కీర్తనలతో ఊంజల్ సేవ పూజలు జరిగాయి. అనంతరం యంఎస్ శ్రీనివాస్‌చే ప్రవచనాలను భక్తులు ఆలకించారు. రాత్రి లక్ష్మీహారం ఊరేగింపు, గరుడవాహన సేవ ఊరేగింపు పూజలు ఘనంగా జరిగాయి. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం విశ్వక్షేనారాధనం, పుణ్యాహావచనం, ప్రధాన కుంభారాధనం, తదుక్త హవనం, పంచాయుధా ధారిగా సూర్యవాహన సేవ ఊరేగింపు పూజలు ఉంటాయి. సాయంత్రం ఉత్సవ మూర్తులకు వసంతోత్సవంతో పాటు గరికపాటి నర్సింహారావుచే ప్రవచనాలు ఉంటాయి. రాత్రి గజవాహన సేవ, ఊరేగింపు పూజలుంటాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని వేంకటేశ్వరస్వామి కృపకు పాత్రు లు కావాలని కోరారు.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపులో బోనాలతో మహిళలు

## గంజాయి విక్రేత అరెస్ట్.. 2.1 కిలోలు స్వాధీనం



బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో గంజాయి విక్రేతను చూపిస్తున్న రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

బాలానగర్ , జూన్ 4 : గంజాయి విక్రేతను రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద 2. కిలోల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చోటు మంగళవారం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్‌కిరణ్ నేతృత్వంలో మూసాపేటలో నిర్వహించిన తనిఖీలలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బాబుల కరాద్ మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద అనుమాన స్పదంగా తిరుగుతుండడాన్ని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గమనించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా తన వద్ద 2 కిలోల 100 గ్రాముల గంజాయి లభించింది. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## కాంగ్రెస్‌కే జై కొట్టిన దేశ ప్రజానీకం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 4: దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దేశ ప్రజానీకమంతా కాంగ్రెస్ పార్టీకే జై కొట్టారని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమిదే అసలైన గెలుపని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో విజయం సాధించిన ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపారు. దేవుడి పేరు చెప్పి ఓట్లు దండుకోవాలని చూసిన బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో కేంద్రంలో సైతం కాంగ్రెస్ అధికారం చేపట్టే శుభ పరిణామాలు రావాలని ఆకాంక్షించారు.

# సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పన

- ముషీరాబాద్ పరిధిలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకానికి 22 పాఠశాలలు ఎంపిక
- రూ. 1.6 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



అడిక్‌మెట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నీటి కుళాయి

ముషీరాబాద్, జూన్ 4 : సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పనకు విద్యాశాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. విద్యా సంవత్సరం మొదలయ్యే నాటికి ముషీరాబాద్ మండలం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కలిపంచడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు ఆ దిశగా పనులు చేపడుతున్నారు.

**అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట సౌకర్యాల కల్పనకు శ్రీకారం..**

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన బస్తీ మన బడి కథకం ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించగా ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టింది.

**22 పాఠశాలల ఎంపిక..**

ఇందులో భాగంగా ముషీరాబాద్ మండలం పరిధిలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో అవసరమైన వసతులు కల్పించే పనులు చేపడుతున్నారు. ముషీరాబాద్ మండలం పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ప్రత్యేక అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మండల పరిధిలోని 22 ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేశారు. ఐదు ఉన్నత పాఠశాలలు, 17 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం రూ. 1.6 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా తొలుత ఒక్కో పాఠశాలకు రూ రూ.40 వేల చొప్పున విడుదల చేసిన అధికారులు బడుల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, బెంచీలు వంటి సౌకర్యాలు కల్పించే పనులను చేపడుతున్నారు.

**మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం..**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇందుకోసం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా ఎంపిక చేసిన 22 పాఠశాలల్లో వసతుల కల్పన కొనసాగుతున్నది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఇంజినీరింగ్ విభాగం అధికారుల సమన్వయంతో పనులు చేపడుతున్నాం.

–చిరంజీవి, డిప్యూటీ డీఈఓ, ముషీరాబాద్

## రాష్ట్ర గీతంలో సాయుధ రైతాంగ పోరాట ప్రస్తావన లేకపోవడం బాధాకరం

బంజారాహిల్స్,జూన్ 4: తెలంగాణ రాష్ట్ర గీతంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరమని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి 118వ జయంతిని పురస్కరించుకుని బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న రావి నారాయణ రెడ్డి ఆడిటోరియం వద్ద తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారకట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, ఈటీ, నర్సింహ, కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి తదితరులు రావి నారాయణరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ..నిజాం నిరంకుశ పాలనకు. రజాకార్లకు వ్యతిరేకంగా మక్దుం మొహియుద్దీన్. బద్దం ఎల్లారెడ్డి తదితర నేతలతో కలిసి గెరిల్లా యుద్ధాలు ప్రారంభించి వారి వెన్నులో చలిపుట్టించిన ఘనత రావినారాయణరెడ్డికి దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకోకపోవడం. రాష్ట్ర గీతంలో తెలంగాణ సాయుధ పోరాటం గురించి ప్రస్తావన లేకపోవడం బాధను కలిగించిందన్నారు. సీపీఐ నారాయణ మాట్లాడుతూ ..తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా సాయుధ రైతాంగ పోరాటాల వార్షికోత్సవాలను అధికారికంగా జరపకపోవడంతో పాటు దశాబ్దిఉత్సవాల్లో కూడా నారాయణరెడ్డిలాంటి వీరుల చరిత్రనుప్రస్తావించలేదన్నారు.

**రావి నారాయణరెడ్డి సేవలు మరువలేనివి**

హిమాయత్‌నగర్: రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఆయన చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ నివాళులర్పించారు.

## యాచకురాలి మృతి

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 4: గుర్తు తెలియని యాచకురాలు మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. ఈ నెల 1న మీర్జాల్‌గూడ రైల్వే క్వార్టర్స్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగి మురళీ కృష్ణకు ఒక మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, క్లూస్ టీంను సైతం పిలిపించి ఆధారాలు సేకరించారు. సమీపంలోని వారిని విచారించగా, ఆమె యాచకురాలని, రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉండేదన్నారు. ఈ క్రమంలో ఆహారం దొర క్క, అనారోగ్యంతో ఆమె మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృ తదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదానికి గురైన వ్యక్తి బైక్ చోరీ

బంజారాహిల్స్,జూన్ 4: బైక్ నడిపిస్తూ అదుపుతప్పి కిందపడిన వ్యక్తికి చెందిన బైక్‌తో పాటు నగదు,సెల్‌ఫోన్ మాయమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఓల్డ్ మిర్జాల్‌గూడకు చెందిన జానకీరామ్ అనే వ్యక్తి గత నెల 24న ఇంటినుంచి తన బైక్ మీద ఆఫీసుకు బయల్దేరాడు. బంజారాహిల్స్ రోడ్ నెం 3లోని టీవీ 9 చౌరస్తా దాటగానే జానకీరామ్ కళ్లు తిరిగి బైక్‌మీద నుంచి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడు స్వల్పంగా గాయపడటంతో పాటు స్పృహ కోల్పోయాడు. స్థానికులు అతడిని సికింద్రాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రికి తీసుకువెళ్లే క్రమంలో అతడి వద్ద ఉన్న రూ.20 వేల నగదు. సెల్‌ఫోన్ మాయమయ్యాయి. ఐదురోజుల తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన జానకీరామ్ ప్రమాదం తర్వాత రోడ్డుపక్కన పార్క్ చేసిన బైక్ కోసం వచ్చి చూడగా సమీపంలో ఎక్కడా కనిపించలేదు. అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన బైక్ మీద నాంపల్లిలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద హెల్మెట్ లేకుండా ఓవ్యక్తి నడిపించడంతో గత నెల 30న చలానా పడిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

# బీజేపీ, టీడీపీ నేతల సంబురాలు



మేడ్చల్ పట్టణంలో జరిగిన సంబురాల్లో బీజేపీ నాయకులు



ఈటల గెలుపుతో స్వీట్లు పంచుతూ సంబురాలు చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన హరీశ్, తదితరులు

మేడ్చల్, జూన్ 4 : రాష్ట్రంలో ఎనిమిది ఎంపీ సీట్లను బీజేపీ కైవసం చేసుకోవడంతో పాటు దేశంలో అధిక స్థానంలో విజయం సాధించడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరుపుకున్నాయి. మేడ్చల్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, బాణా సంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా టీడీపీ నాయకులు మేడ్చల్ పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల, మాలలు వేశారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని, విజయోత్సవాన్ని జరుపుకున్నారు.

- మేడ్చల్ కలెక్టరేట్ : మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీగా భారీ మెజార్టీలో గెలుపొందడంతో పాటు ఎన్‌డీఏ ఘన విజయం సాధించడంతో నాగారంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.
- మల్కాజిగిరి : మల్కాజిగిరి బీజేపీ ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్‌ను మంగళవారం పలువురు నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో టపాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చింతల మాణిక్యరెడ్డి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.
- ఘట్‌కేసర్ : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన సందర్భంగా ఘట్‌కేసర్‌లో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. టీటీడీపీ ఘట్‌కేసర్ మండలం, మున్సిపాలిటీల నాయకుల ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం మధ్యాహ్నం టపాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. అంతకు ముందు నాయకులు,కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి,ఎన్టీఆర్ చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీపీ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు వేముల సంజీవగౌడ్, కొత్త భిక్షపతిగుప్తా, సామల జగన్‌మోహన్‌రెడ్డి, తిరుపాల్, పాటి సురేందర్‌రెడ్డి, బొట్టు సూర్యనారాయణ, టి.మహేశ్, మధుబాబు, జి.చంద్రయ్య, రాము, మహేశ్, పి.జశ్వంత్, అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.
- మల్లాపూర్, జూన్ 4 : మల్కాజిగిరి బీజేపీ ఎంపీగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో మల్లాపూర్ డివిజన్‌లో పార్టీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి మిఠాయిలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్, దొడ్డి యాదగిరి, రాములునాయక్, గణేశ్, సుజాత, శైలేష్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.
- అలాగే..మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లో బీజేపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించి సంబురాలు చేసుకున్నారు. డివిజన్ అధ్యక్షుడు ఏనుముల మహేశ్‌కుమార్, మేడ్చల్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రాంప్రదీప్, బ్రహ్మచారి, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజ్, లింగం, తదితరులు పాల్గొన్నారు.
- రామంతాపూర్ : మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యునిగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో రామంతాపూర్ లో బీజేపీ నేతలు బాణసంచా కాల్చి స్వీటు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీశ్‌లు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి మోదీని మూడోసారిప్రధాన మంత్రి చేసేందుకు దేశప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు.



ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఘన విజయం సాధించడంతో నాగారంలో సంబురాలు చేసుకుంటున్న టీటీడీపీ నాయకులు, కార్యకర్తలు



ఘట్‌కేసర్‌లో టపాసులు కాల్చుతూ సంబురాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు.



మల్కాజిగిరి చౌరస్తాలో టపాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న నాయకులు

## రైలెక్కుతుండగా జారిపడి యువకుడు మృతి

కాచిగూడ, జూన్ 4: రైలెక్కుతుండగా జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ ప రిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేటలోని వర్గల్ ప్రాంతానికి చెందిన కె.సంజీవ డెలివరీబాయ్. సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్‌లో ఫలక్‌నుమా-సికింద్రాబాద్ ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి సంజీవ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

## ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన వాహనం మాయం

కాచిగూడ, జూన్ 4: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మా యమైన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి వివరాల ప్రకారం..మోతీలాల్‌నెహ్రూనగర్‌కు చెందిన బాలరాంచౌదరి ప్రైవేటు ఉద్యోగి. 1వ తేదీ రాత్రి ఇంటి ఎదుట ఏపీ 11 ఏజే 3530 నంబర్ అక్టీవాను పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు చూసేసరికి కనబడలేదు. మంగళవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో అతను ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

